నేటి దినపత్రిక
సూర్య
18 వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
గురువారం | 20 మార్చి 2025 | పేజీలు 8

దళారులను

# నమ్మి మోసపోవద్దు



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

- ప్రభుత్వానికి ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందండి
- అందుబాటులో 5 లక్షల గన్ని బ్యాగ్స్

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మి మద్దతు ధర పొందాలని రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రైతులకు సూచించారు. బుధవారం నెల్లూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన బుధవారం అసెంబ్లీలోని మంత్రి ఛాంబర్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నెల్లూరు జిల్లాలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. నెల్లూరు జిల్లాలో గత రెండేళ్లుగా ధాన్యం కొనుగోలు విషయంలో గత ప్రభుత్వం శ్రద్ధ చూప లేదని, దీంతో రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోతున్న విషయం -మిగతా 2లో

రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల

# ధ్వజావరోహణ

ముగిసిన రంగనాథుని బ్రహ్మోత్సవాలు - అత్యంత వైభవంగా జరిగిన పుష్పయాగం

## నేడు రంగనాథుని తెప్పోత్సవం



నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి వారి దేవస్థానం బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లకు పుష్పయాగం అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తరించారు. -మిగతా 2లో

వినియోగదారుల కేసుల పరిష్కారానికి

# తీసుకుంటున్న చర్యలేంటి?

నెల్లూరు, మేజర్‌న్యూస్ :



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వినియోగదారులకు సంబంధించి కేసుల పరిష్కారానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఏమిటని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం లోక్‌సభలో ఆయన పలు అంశాలపై ప్రశ్నలు వేశారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కన్స్యూమర్ డిస్పోజల్ రిడ్రెసల్ కమిషన్ (ఎస్సీడీఆర్సీ)లో గత మూడేళ్లలో వినియోగదారుల న్యాయస్థానాల్లో 2,200 కేసులు నమోదయ్యాయన్నది వాస్తవమా.. అని ప్రశ్నించారు. కేసుల్లో సత్వర పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు తెలియజేయాలని కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ సహాయ మంత్రి బీఎల్ వర్మ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. గత మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎస్సీడీఆర్సీ)లో 2,260 కేసులు నమోదయ్యాయన్నారు. గత మూడేళ్లలో మొత్తం 1686 కేసులు పరిష్కరించబడ్డాయని వివరించారు. వినియోగదారుల వ్యవహారాల విభాగం వినియోగదారుల రక్షణ, సాధికారత కోసం నిరంతరం కృషి చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి వివరించారు. ప్రపంచీకరణ, సాంకేతికత, ఇ-కామర్స్ మార్కెట్లు మొదలైన కొత్త యుగంలో వినియోగదారుల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇచ్చే ఉద్దేశంతో వినియోగదారుల రక్షణ చట్టం, 1986 స్థానంలో వినియోగదారుల రక్షణ చట్టం 2019 రూపొందించబడిందన్నారు. వినియోగదారుల కేసుల పరిష్కారంలో వేగం పెంచేందుకు కాన్ఫోనెట్ పథకం కింద, జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్సీడీఆర్సీ) 10 బెంచులు, ఆంధ్రప్రదేశ్ ఎస్సీడీఆర్సీ సహా రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషను (ఎస్సీడీఆర్సీ) 35 బెంచుల్లో వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు సమకూర్చామన్నారు. అలాగే వినియోగదారుల కమిషన్లలో ఉన్న ఖాళీలను త్వరితగతిన భర్తీ చేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంతరం కృషి చేస్తున్నాయని వివరించారు.

## పొగాకు రైతుల ఆశలపై నీళ్లు

డీసీపల్లిలో ప్రారంభమైన కొనుగోళ్లు





ఫంక్షన్లలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తే

# భారీ జరిమానాలు తప్పవు

నగరపాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ

నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో జరిగే వివాహ శుభ కార్యాలు, పబ్లిక్ మీటింగులు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్ళు, వైన్ షాపులు, రెస్టారెంట్లలో ఏర్పాటు చేసే ఆహార పదార్థాల సరఫరాలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగిస్తే భారీ జరిమానాలు తప్పవని కమిషనర్ సూర్యతేజ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేస్తూ.. నగరవ్యాప్తంగా ఉన్న క్యాటరింగ్ నిర్వాహకులు, వెడ్డింగ్ ప్లానర్స్, ఇతర ఫంక్షన్ హాళ్ళ నిర్వాహకులు కార్యక్రమాల్లో భాగంగా వాటర్ బబుల్స్, డిస్పోజల్ ప్లాస్టిక్ గ్లాసులు, స్పూనులు, ప్లేట్లు, కవర్లు తదితర 120 మైక్రోన్లకన్నా తక్కువ స్థాయి గల సింగల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను వినియోగించినట్లు తమ దృష్టికి వస్తే నిర్వాహకులకు లక్ష రూపాయల వరకు భారీ జరిమానా విధిస్తామని తెలియజేశారు.

మట్టెంపాడు భూ కుంభకోణంపై

# అధికారులు విచారణ జరిపించాలి

- దళిత గిరిజన కుటుంబాలకు న్యాయం చేయాలి
- జిల్లా రెవెన్యూ అధికారులను కోరిన మట్టెంపాడు రైతులు



నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల పంచాయతీ మట్టెం పాడు గ్రామం లో సర్వే నెం.3లో జరుగుతున్న భూ కుంభకోణంపై జిల్లా రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టి ప్రభుత్వ భూమిని కాపాడాలని, 1983లో 110 దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని మట్టెంపాడు గ్రామ రైతులు జిల్లా అధికా రులను కోరారు. నెల్లూరు నగరంలోని -మిగతా 2లో

# పొగాకు రైతుల ఆశలపై నీళ్లు

## డీసీపల్లిలో ప్రారంభమైన కొనుగోళ్లు





**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** ఆరుగాలం అష్ట కష్టాలు పడి పండించిన పొగాకుకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు ఆశలపై నీళ్లు పడ్డట్లు అయింది. మర్రిపాడు మండలంలోని డీసీ పల్లిలో బుధవారం అట్టహాసంగా కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో కేజీ పొగాకు ధర 250 రూపాయలు మాత్రమే పలికింది. దీంతో రైతులు నిరాశ చెందక తప్పలేదు. రెట్టింపు పెట్టుబడులు పెట్టి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక పోవడంతో వారి ఆశలు అడియాశలయ్యాయి. తొలిరోజున కొనుగోళు ప్రారంభించే ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వ్యాపారస్తులు వేలంలో పాల్గొని పొగాకును కొనుగోలు చేశారు. ఈ వేలం కేంద్రానికి 18 పొగాకు బేళ్లను రైతులు తీసుకురాగా, ఆ 18 బేళ్లను వ్యాపారస్తులు కొనుగోలు చేయడం జరిగింది. ఈ వేళలో ఏడు కంపెనీల వ్యాపారస్తులు పాల్గొని పొగాకును కొనుగోలు చేశారు. వాటిలో ఐటిసి -6, జిపిఐ- 3, అలయన్స్- 2, ప్రగతి- 2, మారుతి- 1, బాబు ఎంటర్ప్రైజెస్- 2, డక్కన్ -2 బేళ్ల చొప్పున పోటీపడి కొనుగోలు చేయడం జరిగింది. మొదటిగా వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్ వేలంలో వ్యాపారస్తుల ముందు 280 రూపాయలు ఉంచగా, అదే ధరకు అన్ని పొగాకు బేళ్ళు అమ్ముడుపోయాయి. అయితే రైతులు మాత్రం ఈ ధర గిట్టుబాటు కాదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఏడాది పెట్టిన పెట్టుబడులకు కిలో గరిష్ట పొగాకు ధర 350 రూపాయల పలికితేనే రైతులు గట్టెక్కుతారని వ్యాపారస్తుల ముందు రైతులు వాపోయారు. అలా లేనిపక్షంలో అదే ధర పలికితే నష్టపోక తప్పదని అభిప్రాయం వ్యక్తం చేశారు. గరిష్ట కనిష్ట ధరలు హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ సరాసరి ధర మాత్రం నిలకడగా ఉంటేనే రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందని రైతులు వ్యాపారస్తుల ముందు వాపోయారు. అందుకు సంబంధించి బోర్డు అధికారులు వ్యాపారస్తులతో చర్చలు జరిపి తగు న్యాయం చేయవలసిందిగా రైతులు కోరుతున్నారు.

# శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన

**జలదంకి, మేజర్‌న్యూస్ :** బాలికల సంరక్షణ,భద్రత పట్ల ఏర్పాటుచేసిన ప్రభుత్వం శక్తి యాప్ పై జలదంకి పోలీసులు బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐలు హరిబాబు, సుబ్బారావు, మహిళ పోలీస్‌లు బాలికలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. బాలికలకు ఎప్పుడైనా.. ఎక్కడైనా.. ఏ ప్రమాదం జరిగినా.. ఎలాంటి విపత్కర పరిస్థితి ఎదురైనా శక్తి యాప్ ద్వారా మెసేజ్ చేస్తే వారికి అండగా ఉంటారన్నారు. ఆరు నుండి పదో తరగతి విద్యార్థులు, ఇంటర్ విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో జలదంకి పోలీసులు పాల్గొన్నారు.




## రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల ధ్వజావరోహణ

*(మొదటి పేజీ తరువాయి)*

రాత్రి 9 గంటలకు దవనోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రాత్రి 11 గంటలకు బ్రహ్మోత్సవాల ముగింపు వేడుకైన ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించారు. చివరిరోజు వేద పండితుల వేద మంత్రోచ్ఛరణలతో గర్భగుడిలో శ్రీదేవి, భూదేవి సమేతంగా రంగనాథస్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు, హెూమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. రాత్రి ఆవభృతం, ధ్వజావరోహణ, తీర్థప్రసాద వితరణ, నాగవలి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఆళ్ళ శ్రీనివాస రెడ్డి, దేవస్థాన సిబ్బంది ఇంకా ఆలయ అర్చకులు పాల్గొన్నారు.భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

*(మొదటి పేజీ తరువాయి)*



ప్రజా ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి తక్కువ రేటుకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దన్నారు. ఇప్పటికే జిల్లాలో 46శాతం వరి కోతలు పూర్తయ్యాయన్నారు. పండించిన ధాన్యాన్ని రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మి 24 గంటలలోనే డబ్బు పొందవచ్చన్నారు. రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని భరోసానిచ్చారు. ధాన్యం కొనుగోలు విషయంలో జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఐదు లక్షల గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు పర్యటించి, ఏమైనా ఇబ్బందులుంటే పరిష్కరించుకునేందుకు చొరవ చూపాలన్నారు. రవాణా విషయంలో ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. అదేవిధంగా ప్రతి మిల్లు వద్ద రెవెన్యూ సిబ్బంది ఉండేవిధంగా ఏర్పాటు చేశామన్నారు.

జిల్లాలో సంఘం, కొవ్వూరు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు ముమ్మరంగా జరుగుతుందన్నారు. ధాన్యం కొనుగోలు జరిగిన 24 గంటల్లోనే రైతు ఖాతాలో నగదు జమ అవుతుం దన్నారు. రైస్ మిల్లర్ అసోసియేషన్‌తో మాట్లాడి దళారుల ప్రమేయం తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైతే రైతుకు ఇబ్బంది లేకుండా ప్రకాశం, బాపట్ల కందుకూరు తదితర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, నెల్లూరు జిల్లా ఇన్చార్జి మంత్రి మహమ్మద్ ఫరూక్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి, వెంకటగిరి ఎమ్మెల్యే కే.రామకృష్ణ, కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డిలతో నెల్లూరు జిల్లా కలెక్టర్ ఆనంద్, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

# మట్టెంపాడు భూ కుంభకోణంపై అధికారులు విచారణ జరిపించాలి

*(మొదటి పేజీ తరువాయి)*

స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత తహసిల్దార్ అయిన ఇస్కా భక్తవత్సలరెడ్డి మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి, మెట్టా ప్రణవ్ కుమార్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులకు చట్ట విరుద్ధంగా ఇచ్చిన 502 ఎకరాల పట్టాలను మంజూరు చేసిందని తెలిపారు. అయితే వెంటనే స్పందించిన ప్రభుత్వం పట్టాలను రద్దుపరిచినా.. సదరు మెట్ట కుటుంబీకులు భూమిని ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా మట్టెంపాడు గ్రామంలో భూ కుంభకోణం జరుగుతుందని, దానిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు. నెల్లూరు రూరల్ మండలం మట్టెంపాడు గ్రామ సర్వే నెం.3లో మొత్తం విస్తీర్ణం ఎ.395 ఎకరాలు కలవని, ఈ భూములను ఇనామ్ భూములుగా చూపించబడి ఉన్నాయన్నారు. మెట్టా రాజగోపాల్రెడ్డి తండ్రి చెంచురెడ్డి, వారి కుటుంబం సభ్యులు తాళ్ళపూడి గ్రామం, నెల్లూరు జిల్లా వీరు రిజిష్టర్డ్ సేల్ డీడ్ డాక్యుమెంట్ నెం.1345/1961 ద్వారా కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్స్ సృష్టించారని ఆరోపించారు. వీరికి బీహార్ రాష్ట్రానికి, తమిళనాడు రాష్ట్రానికి చెందిన వాళ్లు వాదారి వెంకట రమణయ్య, తండ్రి కళ్యాణ సుందరం, వాదారి రామచంద్రయ్య తండ్రి కళ్యాణ సుందరం, కాళహస్తి సుబ్రమణ్యం తండ్రి వీరరాఘవయ్య అనే ముగ్గురు వ్యక్తుల నుండి మెట్టా రాజగోపాల్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు 502 ఎకరాలను కేవలం రూ.40వేలకు కొనుగోలు చేసినట్లు తెలిపారు. వీరి రిజిష్టర్ సేల్ డీడ్ డాక్యుమెంట్‌లో స్వభావం షెడ్యూలు దాఖలా ఆస్తి మాకు పిత్రార్జితం రీత్యా సంక్రమించినవని, మా స్వార్జితపు భూములుగా ఉన్నవని చెప్పి 502 ఎకరాలు కొనుగోలు చేసినట్లు, సదరు భూములను రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నట్లు మెట్ట కుటుంబీకులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఇనామ్ అబాలిషన్ చట్టం 1956 ప్రకారం ఇనామ్దారుడైన, టెనెంట్ అయినా, రైతువారీ పట్టా తీసుకుని మాత్రమే అమ్మాలని, కానీ పై ముగ్గురు వ్యక్తులు ఈ భూమితో ఎలాంటి సంబధం లేకపోయినా చట్ట విరుద్ధంగా మెట్టా రాజగోపాల్ రెడ్డి, వీరి కుటుంబ సభ్యులకు అమ్మినారన్నారు. టెనెంట్ అయితే సాగుబడి చేస్తూ ఇనామ్ చట్టం ప్రకారం, టెనెంట్ యాక్ట్ ప్రకారం రైత్వారీ పట్టా తీసుకోవాలన్నారు. కానీ ఈ ముగ్గురు మన రాష్ట్రంలో కాకుండా బీహార్, తమిళనాడు, హైదరాబాద్‌లో నివసించేవారని, వీరికి టెనెంట్ చట్టం కూడా వర్తించదన్నారు. ఇనాముదారుడు కాకపోయినా మెట్టా రాజగోపాల్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులకు వందల ఎకరాలు మాగాణి భూములు తాళ్ళపూడి గ్రామంలో ఉన్నవని, ఈ భూములు సీలింగ్లో పోతాయని పథకం ప్రకారం ఈ భూములతో సంబంధం లేని వ్యక్తులతో 'ఫేక్ రిజిస్ట్రేషన్' చేయించుకున్నారని తెలిపారు. ఈ మట్టెంపాడు భూములను నీలింగ్లో గవర్నమెంట్‌కు సరెండర్ చేసి రూ.50 వేలు కాంపెన్సేషన్ చెక్కు రూపంలో తీసుకున్నారన్నారు. అంటే గవర్నమెంట్‌ను మోసం చేసి చట్టవిరుద్ధంగా రూ.50 వేలు తీసుకున్నారన్నారు. ఈ భూములకు మెట్టా రాజగోపాల్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులకు ఎలాంటి సంబంధం, ఎలాంటి హక్కు లేదన్నారు. అప్పటి కలెక్టరు శ్రీకాంత్, జానకి విచారణ జరిపించి తహశీల్దారు భక్తవత్సలరెడ్డి జారీ చేసిన ఆర్డర్స్‌ను, పట్టాలను అబయన్స్లో పెట్టి పట్టాలను రద్దు పరచమని సీసీఎల్ఏలో కేసు ఫైల్ చేశారని తెలియజేశారు. వైఎస్ఆర్‌సీపీ నాయకులు చేసిన ఈ భూ కుంభకోణం వెలుగులోకి తీసుకొని వచ్చి, దీని వెనుక ఉన్న వ్యక్తుల మీద, తహశీల్దారు భక్తవత్సలరెడ్డి మీద ప్రభుత్వం చట్ట రీత్యా చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. సమావేశంలో మట్టంపాడు రైతులు రాచమల్లు రమేష్, పల్లాల ధనుంజయ, దువ్వూరు పెంచలయ్య, ఎన్.రమేష్‌నాయుడు, కొల్లి శ్రీనివాసులు, జోసెఫ్ పాల్గొన్నారు.

మద్యం షాపుల నియంత్రించి మహిళల పట్ల

# ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోండి

### విశ్రాంతి ఉపాధ్యాయురాలు సి.శారద



కావలి, మేజర్‌న్యూస్ : కావలి పట్టణంలో ఒక క్రమం లేకుండా అక్రమంగా మద్యం షాపులు రోజురోజుకీ తన ప్రదేశాలను మార్చుకుంటూ జనావాసాల మధ్యలో వ్యాపారస్తులకు ఉద్యోగస్తులకు అసౌకర్యాన్ని కల్పిస్తున్నాయని వాటిని ఎన్డీఏ ప్రభుత్వం, కావలి నియోజకవర్గ పరిధిలో ఉన్న మద్యం షాపులపై కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపించి మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయురాలు సి.శారద తెలిపారు. కావలి పట్టణంలో అసలు మున్సిపల్ పర్మిషన్ లేకుండానే ఎక్సైజ్ అధికారులు తమ స్వలాభం కోసమో.. మద్యం షాపులపై ఉన్న ప్రేమ తెలియదు కానీ నియంత్రణ లేకుండా ఇష్టానుసారంగా మద్యాన్ని విక్రయిస్తున్నారని వారు తెలిపారు. కావలి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉంది, బివిఎస్ సెంటర్లో మద్యం మార్ట్‌ను ప్రారంభించి నిత్యం లక్షల్లో ప్రజలు తిరుగుతూ ఉంటారు. అక్కడ ప్రదేశంలో మద్యం మద్యం సేవించి అక్కడ మహిళలను ట్రాఫిక్‌ను అంతరాయం కలిగిస్తూ.. మద్యం మత్తులో వారు ఏమి చేయుచున్నారో తెలియక అక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ప్రజలను మహిళలను అనేక విధాలుగా ఇబ్బందులు గురి చేస్తున్నారు. ఈ విషయంపై ప్రభుత్వ ఉన్నత అధికారులు కానీ పోలీస్ యంత్రాంగం కానీ ఎందుకు నియంత్రించలేకపోతుందో అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయిందని షాపు ఒక దిక్కు ప్రారంభించాలంటే దానికి మున్సిపాలిటీ అనుమతులు తప్పనిసరి అయితే ఈ అనుమతులు లేకుండానే, అధికారుల అండదండలతో ప్రభుత్వ రాజకీయ నాయకుల సహకారంతో ఈ మద్యం షాపులు విచ్చలవిడిగా, బెల్టు షాపులు విచ్చలవిడిగా ఉన్నాయని ప్రజలు నిరంతరం వాపోతున్నప్పటికీ ప్రభుత్వానికి ఉన్నత అధికారులకు ఇది ఏమీ పట్టనట్టుగా ఉంటున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏది ఏమైనప్పటికీ కావలి పట్టణంలో మద్యం షాపులు ఊసర వెల్లిలాగా మారుస్తూ.. ఉన్నాయని వాటిని నియంత్రించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులకి సంబంధిత అధికారులకు ఉందని మహిళలపై ప్రజలపై ప్రభుత్వంపై ఉన్న నమ్మకాన్ని పోగొట్టుకోకుండా నియంత్రించాలని కోరారు.

## మర్రిపాడు కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు : ప్రిన్సిపాల్ సీహెచ్ లక్ష్మీదేవి

మర్రిపాడు, మేజర్‌న్యూస్ : 2025-26 విద్యా సంవత్సరానికి 6, 11వ తరగతుల్లో మండల కేంద్రంలోని మర్రిపాడు కస్తుర్బాగాంధీ విద్యాలయాల్లో (కేజీబీవీ) ప్రవేశాలకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ బుధవారం సీహెచ్ లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. వీటితోపాటు 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్లను భర్తీ చేస్తామన్నారు. 19వ తేదీ నుండి ఏప్రిల్ 11వ తేదీవరకు (https://apkgbv.apcfss.in) వెబ్ సైట్లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అనాథలు, బడిబయట పిల్లలు, బడిమానేసిన వారు, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్న బాలికలు ప్రవేశాలకు అర్హులని, ఈ సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాల ద్వారా అప్లై చేసుకొనవచ్చని తెలిపారు ఆన్ లైన్ దరఖాస్తు చేసుకొనుటకు విద్యార్థి యొక్క ఆధార్ కార్డు, ప్రస్తుత పాస్ పోర్ట్ సైజ్ ఫోటో, తల్లిదండ్రుల యొక్క ఆధార్ కార్డ్ తీసుకొని వెళ్లవలెను. (అవకాశం ఉన్నవారు ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణ పత్రాలను జత పరచవలెను. బడి మానివేసిన బడి వయస్సు ఆడపిల్లలు, అనాధ పిల్లలు, తల్లి/తండ్రి కోల్పోయిన ఆడపిల్లలు సంబంధిత ధృవీకరణ పత్రాలను కచ్చితంగా జతపరచవలెనని తెలియజేశారు. ఉన్నత విద్యార్హతలు, అనుభవం, అంకిత భావం కలిగిన ఉపాధ్యాయులచే విద్యా బోధన. క్రమ శిక్షణ, ఉత్తమ ఫలితాల సాధనలో కేజీబీవీలు ముందంజలో ఉన్నాయని అన్ని ప్రభుత్వ పథకాలతో పాటు ఉచిత విద్య, వసతులతో కల్పించడం జరుగుతుందని అన్నారు. 6 నుండి 12 తరగతులు వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్య, 8 నుండి 10వ తరగతులకు సీడీఎస్‌ఈ సిలబస్లో విద్యాబోధన, ఐఎఫ్‌పీ, ట్యాబ్‌ల ద్వారా విద్యాబోధన, భరత్ స్కౌట్ యూనిఫాం. ప్రతి రోజు యోగా తరగతులతో పాటు, ఆరోగ్య వ్యాయామ విద్య, క్రీడలు మా ప్రత్యేకత. కేజీబీవీలు బాలికలకు అత్యంత సురక్షిత కేంద్రాలని తమ పాఠశాల విశిష్టత వివరించారు. పూర్తి వివరాలకు సీహెచ్.లక్ష్మీదేవి ఫోన్ 9000850953 సంప్రదించవచ్చు.

# భగత్ సింగ్ కాలనీలో ప్రజా చైతన్య యాత్ర




- పలు సమస్యలపై మాట్లాడిన మహిళలు
- ఎమ్మెల్యే చొరవతో పనులు పూర్తి చేయాలి

బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ : ప్రజా చైతన్య యాత్ర మూడవరోజు బుచ్చిరెడ్డిపాలెం పట్టణ అధ్యక్షులు పోతం శెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో గుడిపల్లి కాలువ సమీపంలోని భగత్ సింగ్ కాలనీలో మంగళవారం చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల తరపున సీపీఎం పార్టీ మహిళా సంఘం నాయకురాలు పలు సమస్యలపై మాట్లాడడం జరిగింది. భగత్ సింగ్ కాలనీ వాసుల సమస్యలు తీర్చండి సీపీఎం మహిళా అధ్యక్షురాలు కప్పా సుజాతమ్మ గుడిపల్లి కాలువ పూడిక తీయకపోతే వర్షాకాలం ఇళ్లలోకే మురికి నీరు చేరుతాయి. గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనప్పటికీ కాలువ రక్షణ పనులు జరగలేదు. కాలువకు ఇరువైపులఉన్న చెట్లను మాత్రమే తొలగించడం జరిగింది. కాలనీలో మురికి కాలువ ఎక్కువగా ఉండటంవల్ల దోమల బెడద ఎక్కువగా ఉంది. కాలనీవాసులు అడగక కాలువ పనుల నిమిత్తమే చెట్లను తీస్తున్నామన్నారు. అనంతరం పనులు అంతటితోనే పనులు ఆపడం జరిగింది. చైర్పర్సన్ మోర్ల సుప్రజా కాలువ పనులు చేయిస్తామని హామీ ఇచ్చారు.. కానీ పనులు మాత్రం చేయలేదు అని తెలిపారు. కోవూరుఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకొని కాలువ పనులు పూర్తి చేయాలని కాలనీవాసుల తరపున సీపీఎం పార్టీ మహిళ సంఘం నాయకురాలు కప్పా సుజాతమ్మ మనవి చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు దత్త కోటయ్య, కొమ్మి శ్రీనివాసులు, సీపీఎం నాయకులు, ఎస్.కెఖాదర్ బాషా, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాయపడిన వ్యక్తి మృతి

ఉదయగిరి, మేజర్‌న్యూస్ : మండల పరిధిలోని మాసాయిపేట బీసీ కాలనీ సమీపంలో ఆటోలో నుంచి జారిపడిన కోమాలోకి వెళ్లిన వేమూరి కొండయ్య (75) బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. మంగళవారం కొండ యవదగిరి నుంచి ఆటోలో స్వగ్రామమైన తిరుమలాపురం ఎస్టీ కాలనీకి వెళుతుండగా ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడ్డారు. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి కోమాలకు వెళ్ళాడని బతకడం కష్టమనే తెలపడంతో కుటుంబ సభ్యులు వెంటిలేటర్ పై ఇంటికి తీసుకువచ్చారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడన్నారు దీంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

## అంధకారంలో ఐదు గ్రామాలు

వింజమూరు, మేజర్‌న్యూస్ : వింజమూరు మండలం నంది గుంట విద్యుత్ ఫీడర్ పరిధిలోనీ ఊటుకూరు నంది గుంటతక్కెళ్ళపాడు, జివ్వి గుంటపాలెం, ఇందిరానగర్ గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. నంది గుంట గ్రామ సమీపంలో జాగీర్ వనం వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న లేఔట్ లనిర్మాణ పనుల్లో భాగంగా టిప్పర్ అక్కడ ఉన్న స్తంభం ఢీకొనడంతో విద్యుత్ వైర్లు తెగిపడడంతో అర్ధరాత్రి నుండి ఆయా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో బుధవారం ఉదయాన్నే విద్యుత్ సరఫరాను పునరుద్దరిస్తారని ఆయా గ్రామస్తులు భావించినప్పటికీ ఇప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు ఎటువంటి ప్రయత్నం చేయకపోవడంతో ఆ ప్రాంతవాసులు ఒకవైపు ఉక్క పోత మరోవైపు విష సర్పాల భయంతో బిక్కు బిక్కు మంటూ ఉన్నారు. అంధకారంలో ఉన్నప్పటికీ విద్యుత్ అధికారులు స్పందించకపోవడం దారుణమని ఆయా గ్రామాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరమైన విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ట్రాన్స్కో అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనను గ్రామ వాసుల అవస్థను అర్థం చేసుకొని వెంటనే విద్యుత్ పునరుద్దీకరణ పనులు చేపట్టాలని ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు.

## సోమశిల ప్రాజెక్టు ఈఈగా శ్రీనివాస కుమార్



అనంతసాగరం, మేజర్‌న్యూస్ : సోమశిల ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా బుధవారం బి.శ్రీనివాస్ కుమార్ పదవి బాధ్యతలు స్వీకరించారు. నిన్నటి వరకు ఇన్‌చార్జ్ ఈఈగా దశరథ రామ్‌రెడ్డి విధులు నిర్వహిస్తూ వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారుల బదిలీల ప్రక్రియ నేపథ్యంలో నూతన నియామకం జరిగింది. ప్రాజెక్టు అధికారులు సిబ్బంది శ్రీనివాస కుమార్‌కు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జేఈలు గురు ప్రసాద్, పెద్దిరాజు, నిఖిల్, రామ్మోహన్ రెడ్డి, శరత్ చంద్ర, ఆత్మకూరు నియోజకవర్గం ఎన్జీవో కార్యదర్శి బల్లి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కొంగి ఉత్తయ్య, వర్క్ చార్జ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పలపాటి రామయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆనంని కలిసిన వైసీపీ జిల్లా మహిళా నేతలు



నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ : వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డిని వారి నివాసం నందు మర్యాదపూర్వకంగా కలిసిన నెల్లూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ సునంద, నెల్లూరు రూరల్ నియోజకవర్గం సాంస్కృతిక అధ్యక్షురాలు శారద, నెల్లూరు రూరల్ నియోజకవర్గం అంగన్వాడి అధ్యక్షురాలు శాలిణి, బషీర, రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారులకు అక్కడికక్కడే సమస్యలు పరిష్కారం




నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ : ఏపి టిడ్కో చైర్మన్ సూచనల మేరకు బుధవారం నెల్లూరు జిల్లా గోమతి నగర్ జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించిన నూనె మల్లికార్జున యాదవ్ ప్రజలు వారి సమస్యలు చెప్పి అర్జీలు ఇవ్వగా నూనె మల్లికార్జున యాదవ్ అక్కడికక్కడే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో లాయర్ శరత్, రిటైర్డ్ డీఈఈ వెంకటేశ్వర్లు, 13 డివిజన్ ఇన్‌చార్జ్ పెనేటి శ్రీకాంత్, జనసేన నాయకులు, వీరమహిళలు పాల్గొన్నారు.

# పన్నులు వసూళ్లలో మొదటి స్థానంలో కావలి మున్సిపాలిటీ

## పన్నులు సకాలంలో మున్సిపాలిటీకి చెల్లించి అభివృద్ధికి తోడ్పడండి : ఆర్‌ఐ ఫణి కుమార్



**కావలి మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ప్రతి గృహ యజమానులు సకాలంలో మిగిలిపోయిన బకా యిలలైన ఇంటి పన్నులను, కుళాయి పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపల్‌కి అభివృద్ధికి సహకరించాలని కావలి మున్సిపల్ రెవిన్యూ ఆఫీసర్ పి.ఫణి కుమార్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కావలి పట్టణంలో సుమారు 11వేలకు పైగా అసెస్మెంట్లు ఉన్నాయని వాటిలో కొత్తగా ఇల్లు కట్టించుకున్న వారు, ఖాళీ స్థలంలో పన్ను వేయించుకోకుండా ఉన్నవారు వారు మున్సిపాలిటీ ద్వారా అన్ని అనుమతులు తీసుకోవాలని ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని తెలిపారు. అలాగే కావలి మున్సిపాలిటీ పరిధిలో ప్రస్తుతం పన్నులు వసూలు చేసే కార్యక్రమంలో ముందంజలో ఉందని వారు తెలిపారు. 11 వేలకు పైగా ఉన్న అస్సి స్మెంట్లో సుమారు సగానికి పైగా పన్ను వసూల కార్యక్రమాన్ని చేపట్టామని, అలాగే గురువారం నుండి పూర్తిగా ఇంటి పనులు, పన్నులు ఖాళీ స్థలం పన్నులు నూతనంగా నిర్మించిన గృహాలపై పన్నులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడుతుందని, ప్రతి ఒక్కరు కూడా మున్సిపాలిటీని అభివృద్ధి పరిచేందుకు ప్రజలు తమ వంతుగా సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంచినీరు కానీ డ్రైనేజీ వ్యవస్థ కాని పారిశుద్ధ్యం కూడా సక్రమంగా అమలులో ఉంటుందని అభివృద్ధికి సహకరించకపోతే ప్రజలు మున్సిపాలిటీ ద్వారా అందవలసిన సౌకర్యాలు అందకపోగా, నష్టాల్లో కూరుకుపోతారని అలాగే ఇంటి పన్ను వడ్డీతో సహా చెల్లించకుండా సకాలంలో పనులు చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. అలాగే కావలి పట్టణ ప్రజలు ఎక్కడైతే మొండి బకాయిలు ఉన్నాయో.. వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతుందని, ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఇంటి పన్నుల బకాయిల విషయంలో అలసత్వం చేయకుండా త్వరగా బకాయిలు చెల్లించేందుకు సహకరించాలని వారు కోరారు.

# సింహపురి ఉగాది మహోత్సవం గోడ పత్రికలు ఆవిష్కరణ




**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరం స్థానిక శివాజీ సెంటర్ వద్ద నున్న టీవీఎస్ కళ్యాణ సదన్ నందు బుధవారం సింహపురి ఉగాది ఉత్సవ సమితి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా సింహపురి ఉగాది ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. శివాజీ సెంటర్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం, టీవీఎస్ కళ్యాణ సదన్ సంయుక్తంగా ఉగాది ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉగాది మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సనాతన ధర్మంలో ఉగాదిని సంవత్సరానికి తొలి రోజుగా పండుగను చేసుకుంటున్నామని షడ్రుచులనూ ఆస్వాదిస్తున్నామని పేర్కొంటూ, తెలుగు సాంప్రదాయాలను విశిష్టతను రేపటి తరానికి అందిస్తూ తెలుగు విశ్వావసు నామ సంవత్సర ఉగాది మహోత్సవాలు మార్చి 30వ తేదీనఘనంగా శివాజీ సెంటర్ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం వద్ద ఉదయం నుంచి సాంప్రదాయంగా, సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమ వివరాలతో గోడ పత్రికలు కరపత్రికలను పలువురు ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యనిర్వాహక అధ్యక్షులు టీవీఎస్ కళ్యాణ్ సదన్ మేనేజింగ్ ట్రస్టీ దేశభట్ల మణిరత్నం మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం టీవీఎస్ కళ్యాణ సదన్ నందు ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, ఈ సంవత్సరం వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానం వద్ద మిత్రులతో కలిసి ఉగాది మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం ఏడు గంటల నుండి గోపూజ, గణపతి అభిషేకము, అర్చనలు, ఉగాది పచ్చడి ప్రసాద వితరణలు, సాయంత్రం నాలుగు గంటలకు పలు భజన మండళ్ళచే కోలాట ప్రదర్శనలు శాస్త్రీయ సంగీత కచేరీలు వుంటాయి. సాయంత్రం 6గంటలకు మహాదీపారాధన, పంచాంగ శ్రవణం, వేద ఆశీర్వాదం తదుపరి పలువురి ప్రముఖుల సమక్షంలో పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య సంస్థానాద్విశ్వరులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి మహాస్వామి వారిచే అనుగ్రహ భాషణం, ఉగాది ఆశీర్వచనం జరుగుతుందన్నారు. భక్తులందరికీ ఉగాది ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. అధ్యక్షులు బీఎస్ రంగరాజన్ మాట్లాడుతూ.. నెల్లూరు నగరంలో జరిగే ఈ ఉగాది మహోత్సవ కార్యక్రమానికి నగర ప్రజలకు ప్రతి దేవస్థానంలో ధార్మిక సంస్థలతో కలిసి భక్తులం దరినీ ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. తెలుగు సాంప్రదాయ వస్త్రధారణతో సామూహికంగా ఉగాది మహోత్సవాలను జరుపుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమ సమన్వయకర్త పి.సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ.. సింహపురి ఉగాది ఉత్సవ సమితి నూతన కార్యవర్గ కమిటీని ప్రకటించారు. గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ సివి సుబ్రహ్మణ్యం, గౌరవ సలహాదారులుగా ఆడిటర్ సివి సుబ్రహ్మణ్యం, పిట్టి సత్య నాగేశ్వరరావు, అధ్యక్షులుగా బిఎస్ రంగరాజన్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా టీవీఎస్ సత్రం మేనేజింగ్ ట్రస్టీ దేశభట్ల ఫణి రత్నం, ప్రధాన కార్యదర్శులుగా వి.హర్షవర్ధన్, జగన్‌లతోపాటు పలువురు ప్రత్యేక ఆహ్వానితులుగాను కమిటీ సభ్యులుగాను ఉగాది మహోత్సవం విజయవంతం అయ్యేందుకు పనిచేస్తారని ప్రకటించారు. కార్యక్రమంలో బి.నాగలక్ష్మి, ఉమాదేవి, జయలక్ష్మి, నీలి రాఘవ, కెవి సుబ్రహ్మణ్యం, భాస్కర్ రావు, బాలసుబ్రమణ్యం, మధుసూదన్ పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

# టీడీపీ ఎస్సీ సెల్ మతంగి కృష్ణ ఆధ్వర్యంలో సంబరాలు

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నెల్లూరులో సంబరాలు నిర్వహించారు. స్థానిక వేదాయపాలెం సెంటర్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం దగ్గర చంద్రబాబు నాయుడుకి పాలాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ. టీడీపీ రాష్ట్ర నాయకులు దేగ రవి రాఘవేంద్రలు ఎస్సీ వర్గీకరణతో అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని క్యాబినెట్ నిర్ణయంను స్వాగతిస్తున్నామన్నారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రిపోర్టుకు క్యాబినెట్ ఆమోదం పలకడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో కుడుముల సుబ్బారావు. పలిగళ్ళ పెంచలయ్య. కువరపు నాగేశ్వరరావు, నందిపాటి ఇజ్రాయిల్, చల్లా భాస్కర్, శ్యాము. బిరుదోలు సుభాష్, గీతాకృష్ణ, పద్మ, తోడేటి మురళి, తాటిపర్తి బాబు. పదార్తి నరసింహులు, సుమన్, కొత్త చిన అంజనేయులు, ప్రసాద్, వేణు, సునీలు, చేవూరు మారుతి, వెంకట్, నాగార్జున పాల్గొన్నారు.



## పది విద్యార్థులకు అవసరమైతే లిఫ్ట్ ఇవ్వండి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థిని విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు వెళ్తున్న సమయంలో సమయాభావం లేకపోతే సహృదయంతో లిఫ్ట్ ఇవ్వాలని నియోజకవర్గ జనసేన పార్టీ విజ్ఞప్తి చేసింది. బుధవారం మండల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌బాబు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరీక్షలు రాసి బయటకు వచ్చిన విద్యార్థుల విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజలు మజ్జిగ తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు బాగా పరీక్షలు రాయాలన్నారు. ఏమాత్రం ఆందోళనకు ఒత్తిడికి లోను కాకుండా చదువుకున్న సబ్జెక్టు నిర్భయంగా రాయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

## సునీత విలియమ్స్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం




**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** అంతరిక్షంలో అద్భుతాలు ఆవిష్కరించి పరిశోధన కోసం వెళ్లిన సునీత విలియమ్స్ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలాం పురస్కార గ్రహీత గండికోట సుధీర్ కుమార్ అన్నారు. బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ రామచంద్రాపురంలో అంతరిక్ష శాస్త్రవేత్త సునీతా విలియమ్స్ జీవిత చరిత్రను బుధవారం విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8 రోజులు పరిశోధన చేయడానికి వెళ్లి 9నెలలైనా ఆమెలో సడలని ఆత్మవిశ్వాసం, ధృఢ చిత్తం నేటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సురక్షితంగా భూమికి తిరిగి వచ్చిన సునీత విలియమ్స్ ఆత్మవిశ్వాసానికి కేరింతలు కొడుతూ విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

## రేవూరులో షార్ట్ ఫిలిం షూటింగ్ సందడి



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** అనంతసాగరం మండలం రేవూరు గ్రామంలో బుధవారం షార్ట్ ఫిలిం షూటింగ్ జరిగింది. ప్రముఖ సినీ రచయిత, ఆర్టిస్ట్ తనికెళ్ల భరణి ప్రముఖ ప్రధాన పాత్రగా పలు సన్నివేశాలు చిత్రీకరించారు. గ్రామానికి చెందిన శ్రీ తేజ సాయి ట్రస్ట్ అధినేత, ప్రవాస భారతీయుడు అయిన బోయెల్ల జనార్దన్ రెడ్డి నిర్మాతగా వ్యవహరించనున్నారు. పల్లెటూరు వాతావరణం సన్నివేశాలను గ్రామంలో చిత్రీకరించారు. షూటింగ్ను సందర్శించేందుకు మండలంలోని పలు గ్రామాలనుంచి సినీ ప్రేక్షక అభిమానులు తరలి వెళ్లారు.

## అర్ధరాత్రి మెరుపుదాడులు : ఎస్ఐ



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలోని దేవర తిప్ప వద్ద బుధవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో స్థానికుల సమాచారం మేరకు సైదాపురం పోలీస్ స్టేషన్ బృందం దేవర తిప్ప వద్ద కోర్జి మెటీరియల్‌లో తవ్వుతున్నటువంటి రెండు జేసీబీలను పట్టుకొని సీజ్ చేయడం జరిగిందని ఎస్ఐ క్రాంతి కుమార్ తెలిపారు. ఇందులో మొత్తం ఆరు మంది ముద్దాయిలపై క్రిమినల్ కేసులు రిజిస్టర్ చేయబడినవి అని తెలిపారు.

# ప్రతిపక్ష పార్టీ దళారులే వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు

## మీడియా సమావేశంలో ధ్వజమెత్తిన అధికార పార్టీ నాయకులు



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ప్రతిపక్ష పార్టీకి చెందిన వ్యాపారస్తులే దళారులుగా రైతులు నుండి వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నారని అలాంటప్పుడు రైతులకు ప్రభుత్వం ఇస్తున్నటు వంటి గిట్టుబాటు ధరను వారే కల్పించాలని అధికార పార్టీ నాయకులు ధ్వజమెత్తినారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి దమ్మాయి గ్రామపంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం లేదని గిట్టుబాటు ధర లేక తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని మిల్లర్లు దళారులు దోచుకుంటూ ఉన్నారని తెలుగుదేశం ప్రభుత్వంపై ఆయన విమర్శలు చేయగా బుధవారం స్థానిక అధికార పార్టీ నాయకులు, పంటపాలెం సాగునీటి వినియోగదారుల సంఘం ఉపాధ్యక్షులు పడాల నరసారెడ్డి తన నివాస గృహం నందు విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలు చేస్తున్న వారిలో టీడీపీ దళారులు ఎవరూ లేరని ఆయన అన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో రైతులకు బిపిటి ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర రైతులకు ఇస్తూ రైతుల నుంచి వరి ధాన్యం ప్రతిపక్ష పార్టీ దళారులే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తమ నాయకుడు సోమిరెడ్డిపై విమర్శ చేయడం ఖండిస్తున్నామన్నారు. మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పల్లికొండ శీనయ్య మాట్లాడారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి రైతుల పక్షాన నిలిచి శాసనసభలో గిట్టుబాటు ధర గురించి మాట్లాడలేదా అంటూ మాజీ మంత్రి కాకాణిని ప్రశ్నించారు. గత ప్రభుత్వ పరిపాలనలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. మాజీ మంత్రి కాకాణి విమర్శలు చాలా బాధాకరమన్నారు. యూరియా బస్తాను 400 రూపాయలకు రైతులకు కొనుగోలు చేసుకున్నారని ఆయన ఆరోపించడం ఏంటన్నారు. మండలంలో ఎక్కడైనా ఏ ఒక్క రైతు కూడా ఆ ధరకు కొనుగోలు చేసి ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డిపై రాజకీయ విమర్శలు మానుకోవాలని సూచించారు. భాజపా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు ఈశ్వర్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వంలో మాజీ మంత్రి ఎన్నో పాపాలు చేశారన్నారు. నాన్ ఫిషర్మెన్ ప్యాకేజీ ఎక్కువ మందికి ఇవ్వకుండా నిలిపివేశారని విమర్శించారు. దళిత నాయకులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్కరికి పని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. 50మందికి పని కల్పించలేదని మాజీ మంత్రి ఆరోపణ చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. 50 మంది పక్కా గృహాలు నిర్మాణం చేసుకుంటున్నారని వారికి ఉపాధి పని వర్తించదన్నారు. ఇకనుంచి ఎమ్మెల్యే సోమిరెడ్డిపై విమర్శలు చేయకుండా ఉండాలన్నారు. ఈ సమావేశంలో సాగునీటి సంఘం డైరెక్టర్లు శ్రీధర్ రెడ్డి, ఇంగిలాల మస్తానమ్మ, వేణు యాదవ్, ఉప సర్పంచ్ నాగార్జున యాదవ్, గ్రామస్తులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దులూరి ప్రసాదరావు ఆధ్వర్యంలో బోగోలు మండల అభివృద్ధి అధికారి సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖ అధికారిని ఎం.జయమ్మ చేతుల మీదగ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత కేజీఆర్‌వీఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సంజయ్ రవి కొండని అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. విద్యార్థినీ విద్యార్థులు చదువుల్లో ఒక ఆశయంతో చదవాలని, ఆశయం సాధించేందుకు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరుంది తీసుకురావాలని కోరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఎండలో పిల్లలు ఎక్కువసేపు ఎండలో ఉండద్దని సూచించారు. పిల్లలు కాఫీ, టీ తాగడం అలవాటు చేసుకోవద్దని మజ్జిగ అలవాటు చేసుకోవాలని, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకొని, పదిమందికి సహాయం చేసే విధంగా బ్రతకాలని సూచించారు. ఎంఈఓ జయమ్మ మాట్లాడుతూ.. పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు ప్రసాదరావు మజ్జిగ చలివేంద్రాన్ని దాతల సహాయంతో 30 సంవత్సరాల నుండి నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ వైస్ చైర్మన్ యు.కౌసల్య, ఏ.సుబ్రహ్మణ్య చారి, సహోపాధ్యాయిని దేగా. విజిత, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కరెంటు చార్జీలు తగ్గించాలి : సీపీఎం




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** కరెంటు బిల్లులలో వివిధ రకాల పేర్లతో మోపుతున్న అదనపు భారాలను ప్రభుత్వమే భరించాలని, పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం సీపీఎం నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు మినీ బైపాస్ మిలీనియం సబ్ స్టేషన్ వద్ద ప్రజలతో కలిసి సీపీఎం నాయకులు, కార్యకర్తలు కరెంట్ బిల్లులను దగ్ధం చేశారు. నెల్లూరు సిటీలో 53 యూనిట్లకు 687 రూపాయలు కరెంటు బిల్లు విధించారని, అంటే యూనిట్‌కు 14 రూపాయలు చొప్పున బిల్లు విధించారు. భూమ్మీద ఎక్కడ కూడా ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం విధించిన యూనిట్ రేటు ఉండబోదు అని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అదనపు భారాలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేసిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చి వేల కోట్ల రూపాయలు ప్రజలపై భారాలు మోపుతున్నారు అని తెలిపారు. ప్రజలతో కలిసి స్మార్ట్ మీటర్లు పగలగొడతామని తక్షణమే స్మార్ట్ మీటర్లు బిగించే చర్యలు ఆపాలి అని డిమాండ్ చేశారు. ఇంధన సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలు, సర్వీసు చార్జీలు రకరకాల పేర్లతో మోపుతున్న అదనపు భారాలను ప్రభుత్వమే భరించాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నెల్లూరు నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బీదను సత్కరించిన బీసీ నాయకులు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** మన బీసీ టీడీపీ నాయకుడైన బీదా రవిచంద్ర ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా నెల్లూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పనమాల శ్రీహరి రావు ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షులు సెక్రెటరీ అయినా మంచికలపాటి నర్మద బాయ్ (అడ్వకేట్), బొందిలి సంఘం లీగల్ అడ్వైజర్ ఎం.తరుణ్ సింగ్, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు యాదవ సంఘం అధ్యక్షులు వడ్డెర సంఘం అధ్యక్షుడు, బీసీ కులాల పలు సంఘాల అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు ఉపాధ్యక్షులు అందరూ ఆయన్ని కలసి అభినందించి ఆయన సత్కరించారు.

## కాకుటూరులో యువత రక్తదానం



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మండలం కాకుటూరులోని గ్లోరియస్ క్రైస్ట్ చర్చిలో బుధవారం చెంతాటి స్నేహిత్ షారోన్ తృతీయ వర్ధంతి నిర్వహించారు. నెల్లూరుకు చెందిన చెంతాటి చంద్రశేఖర్, మేరీ సుశీల దంపతుల కుమారుడైన స్నేహిత్ షారోన్ మూడేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా, 80మంది యువతీ యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అంతేకాదు, ఈ కార్యక్రమంలో అన్నదానాన్ని కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెంతాటి చంద్రశేఖర్, మేరీ సుశీల, చర్చి బ్రిసప్ విద్యుల్లత, ఇతర కుటుంబ సభ్యులు, చర్చి సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు. స్నేహిత్ షారోన్ జ్ఞాపకార్థం చేపట్టిన ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు ప్రశంసించారు.

## కండలేరు డ్యామ్ మెయింటెనెన్స్ బకాయిలు తమిళనాడు నుండి వసూలు చేయాలి

▶ బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** చెన్నై నగరం దాహార్తి తీర్చేందుకు గాను చెన్నై మెట్రో వాటర్ సభ్యులు. కృష్ణా రివర్ వాటర్ సప్లై సభ్యులు కండలేరు డ్యామ్‌ను నేడు సందర్శించారు. 2025 సంవత్సరం చెన్నై దాహార్తి తీర్చేందుకు తాగునీరు అందించాలని నెల్లూరు జిల్లా ప్రాజెక్ట్ అధికారులను కోరారు. కండలేరు హెడ్ రెగ్యులేటర్ పూండి వరకు ఉన్న ప్రధాన కాలువ మెయింటెనెన్స్‌కు తమిళనాడు ప్రభుత్వం నెల్లూరు జిల్లా ప్రాజెక్టు అధికారులకు చెల్లించాల్సిన బకాయలు పెద్ద మొత్తంలో 300కోట్ల రూపాయలు వరకుఉన్నాయి. కండలేరు ప్రాజెక్టు అధికారులు డ్యాం సమర్థవంతంగా నిర్వహణ చేసేందుకు తమిళనాడు ప్రభుత్వం నుండి బకాయిలు రాబట్ట వలసినదిగా మనవి. వాస్తవ పరిస్థితుల్లో లో లెవెల్ స్లుయిస్ గేటులు మరమ్మత్తులకు లోనై కదలని పరిస్థితుల్లో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రాజెక్టు నిర్వహణకు నిధులు విడుదలలో జాప్యం జరుగుతున్న దృష్ట్యా చెన్నై మెట్రో అధికారులు ఇవ్వవలసిన బకాయిలు రాబట్టవలసిందిగా ప్రాజెక్ట్ అధికారులకు మిడతల రమేష్ మనవి చేశారు.

# రత్నాపూర్‌లో షూటింగ్ ప్రారంభం

## కెమెరా స్విచ్ ఆన్ చేసిన సీపా రెడ్డి వంశీధర్ రెడ్డి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** బుధవారం ఉదయం 9:30 నిమిషాలకు నెల్లూరు రూరల్ మండలంలోని సౌతమోపూర్ గ్రామం లోని గ్రామాదేవత మోపురమ్మ దేవాలయంలో ఫోర్ పిల్లర్స్ ఫిలిమ్ హౌస్, ప్రొడక్షన్ నెంబర్ 1 బ్యానర్ పై నూతన సినిమా ముహూర్తం షూటింగ్ ప్రారంభోస్తవం జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మవారికి పూజనుగ్రహాలు నిర్వహించి తీర్థ ప్రసాదలు పంచిపెట్టడం జరిగింది. పై కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన బీజేపీ జిల్లా అధ్యక్షులు సిపా రెడ్డి వంశిధర్ రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చెయ్యగా ప్రవీన్ బండా డైరెక్షన్ చెయ్యగా హీరో రణధీర్, హీరోయిన్ అనక,విల్లన్ మట్ట శ్రీనులపై సన్నివేశాలను చిత్రికరించారు. అనంతరం నిర్మాతలు ముక్కు రాధాకృష్ణ గౌడ్, ఈశ్వర్. పి, వెంకీ దొమ్మరాజు, అల్పూరి రవి ప్రకాష్ మాట్లాడుతూ.. ఈ చిత్ర కథాంసం 1980 దసకంలో ఒక గ్రామంలో జరిగిన సంఘటనల అనుగుణంగా జరిగిందని, కావున దానికి తగినట్లు నెల్లూరు పరిసర గ్రామాలలో వున్న ప్రాంతాలలో చిత్రనిర్మాణం చేపట్టామని లవ్, రొమాంటిక్, క్రైమ్, త్రిల్లర్ డ్రామాగా ప్రజల మనసులు చొరగొనే విధంగా నిర్మిస్తున్నామని, అన్ని వర్గాల, అన్ని వయసుల మనసులను ఆకట్టుకుంటుందని ఆశభావన్నీ వ్యక్తం చేశారు. సౌతమోపూర్ గ్రామంతోపాటు నరసింహాకొండ, కొండ్లపూడి, మారుపురు, బుచ్చిరెడ్డి పాలెం, పార్లపల్లి, గంగపట్నం తదితర గ్రామాలలో రాబోయే 25రోజుల పాటు షూటింగ్ నిర్వహించ్చునున్నట్లు పేర్కొన్నారు. కో ప్రొడ్యూసర్స్ కె.ఈశ్వర్, కరెడ్డి నాగిరెడ్డి, పముజుల నవీన్ కుమార్, గ్రామ నాయకులు మరియు గ్రామ పెద్దలు వి.సుధాకర్, టి.రామయ్య, పి.కామేశ్వరరావు, చిత్ర యూనిట్ సభ్యులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డీకేటి పట్టాలలో దౌర్జన్యంగా ఆక్రమణ




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల్లూరు రూరల్ మండలంలో జరుగుతున్న ప్రజా చైతన్య యాత్రల పర్యటనలనలు నెల్లూరు రూరల్ మండలంలోని సజ్జాపురం గొల్ల కందుకూరు గ్రామాలలో పేదలు సాగు చేసుకుంటున్న డీకేటి పట్టాలలో కొంతమంది దౌర్జన్యంగా వేసిన బాటను, గొల్ల కందుకూరులో జరిగిన రీ సర్వే పట్టాలను పరిశీలించారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్‌లు మాట్లాడుతూ.. సజ్జాపురం గ్రామంలో 40సంవత్సరాలుగా ఎరుకల కులానికి చెందిన మరిమేసి వెంకటయ్య అనుభవంలో ఉన్న డీకేటి పట్టాలలో 25 సెంట్ల లో కొంతమంది యాదవులు ఆక్రమించి దౌర్జన్యంగా బాట వేసుకున్నారని సదరుబాటను పరిశీలించడం జరిగింది. ఆక్రమించుకున్న బాటకు బదులుగా వీరికి మరోచోట భూమిని ఇవ్వాలని అన్నారు. అలాగే గొల్లకందుకూరు గ్రామంలో ఇటీవల జరిగిన రీ సర్వేలో అనేకమందికి పేర్లు తప్పులు పడ్డాయని సదరు పేర్లను సరి చేయాలంటే లంచం డిమాండ్ చేస్తున్నారని తెలిపారని నెల్లూరు రూరల్ తహసిల్దార్ దీనిపై స్పందించి జరిగిన తప్పులను సరి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు రూరల్ మండలం కమిటీ సభ్యులు శ్రీపతి దయాకర్, మరిమేసి కామాక్షయ్య, కోటపూడి సుబ్రహ్మణ్యం, పాదర్తి మస్తాన్, మరిమేసి సురేష్, బద్దిపూడి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి మాజీ మంత్రి కాకాని.. నీకు పుట్ట గతులు ఉండవ్



**జలదంకి, మేజర్‌న్యూస్ :** గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో వ్యవసాయ శాఖ శాఖ మంత్రిగా కాకాని గోవర్ధన్ రెడ్డి ఏ ఒక్క రైతుకు సహాయం చేయకుండా నల్లధనాన్ని మూట కట్టుకొని అబ్బాసు పాలైన సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అటువంటి అవినీతి మంత్రి మా ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌పై అసత్య ఆరోపణలు చేయడం దుర్మార్గమని జలదంకి మండల తెలుగుదేశం, బీజేపీ, జనసేన నాయకులు మండిపడ్డారు. బుధవారం జలదంకి పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. జలదంకిలో ఏర్పాటు చేసిన సమావేశానికి టీడీపీ నాయకులు గంట అశోక్, జనసేన పార్టీ నాయకులు నిమ్మలపల్లి రామ చైతన్యలు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఉన్నత విద్య అభ్యసించి అమెరికాలో ఎన్ఆర్ఐగా పేరు తెచ్చుకొని అక్కడ మంచి కార్యక్రమాలు చేస్తూ సొంత నియోజకవర్గానికి సేవ చేయాలనే సంకల్పంతో ఉదయగిరి నియోజకవర్గాన్ని ఎంచుకొని రాజకీయాల్లోకి అడుగు పెట్టారు అన్నారు. కాకర్ల ట్రస్ట్ పేరుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పేదలకు అండగా ఉంటూ ట్రస్టు ద్వారా సేవలు అందించారని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఏ కష్టం వచ్చినా నేనున్నానని భరోసా కల్పించి వారికి సహాయం చేశారని అన్నారు. ఆయన సేవలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సురేష్‌ను ప్రకటించారని, ఆయన ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అనంతరం 9 నెలల పాలనలో నియోజకవర్గ అభివృద్ధికి పేద ప్రజల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తూ ప్రశంసలు పొందుతున్నారని అన్నారు. ఆయన ఎదుగుదలను చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు ఆయనపై సత్య ప్రచారాలు చేస్తూ విమర్శలు గుప్పించడం తో ఆశిస్యపదంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యేగా గెలవక ముందే కాకర్ల సురేష్ నియోజకవర్గంలో దాదాపు 25 నుండి 35 కోట్ల వరకు పేదల సంక్షేమం కోసం ఖర్చు చేశారని గుర్తు చేశారు. అటువంటి మా నాయకుడి పై జామాయిల్ చెట్లు నరుక్కొని నగదు సంపాదించారని అవినీతి ఆరోపణలు చేయడం వైసిపి నాయకులకు తగదు అన్నారు. మా ఎమ్మెల్యే పై ఇటువంటి ప్రచారాలు చేసి ఆనందం పొందాలనుకుంటే మీకు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు మా బలం ఏంటో చూపిస్తారని తెలిపారు. మీరు ఇలాగే మా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మా యువనేత లోకేష్, మా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు తాటతీస్తాం గుర్తుపెట్టుకోండి అంటూ హెచ్చరించారు. ఏదో టూర్ లాగా ఉదయగిరి నియోజకవర్గానికి వచ్చి జామాయిల్ చేతుల్లో తిరిగి రెండు మూడు కోట్లు దోచుకున్నారు అంటూ మీడియా ముందు ప్రగల్ బాలు పొందిన పలికిన వైసీపీ నాయకులకు తీవ్ర హెచ్చరికలు చేస్తున్నామని, మా ఎమ్మెల్యే పై ఇంకెప్పుడైనా ఎలాంటి ఆరోపణలు చేస్తే తెలుగుదేశం కార్యకర్తలు తరిమి తరిమి కొట్టే దౌర్భాగ్యం మీకు వస్తుందని గుర్తు చేస్తున్నామని, ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పులిగుంట మధుమోహన్ రెడ్డి, టీడీపీ తెలుగుయువత అధ్యక్షులు మునగాల తిరుమలరెడ్డి, టీడీపీ మాజీ కన్వీనర్ చిత్తా బత్తిన మస్తాన్ రెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షులు కంచర్ల వినోద్ నాయుడు, ఐ-టీడీపీ మండల అధ్యక్షులు ఏగురు రఘు, టీడీపీ నాయకులు పచ్చ పెంచుల నాయుడు, నక్క మాధవరావు, పూనూరు రామకృష్ణారెడ్డి, యమ్ మధుసూదన్ రెడ్డి, సుధీర్ బాబు, సుధాకర్ రెడ్డి, తిరుమల, వడ్డే వంశీ, హరి, మనోజ్, వద్దినేని మురళి, హరిబాబు, బీజేపీ మండల అధ్యక్షులు ముడి కిషోర్ రెడ్డి, బీజేపీ ఎంపీటీసీ కుట్టుబోయిన మాధవ్ యాదవ్, జనసేన మండల మైనార్టీ అధ్యక్షులు జానీ బాయ్, కూటమి వినాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 167 జీబీ హైవే పనుల్లో నాణ్యత లోపం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** కావలి-సీతారాంపురం 167 జీబీ హైవే పనుల్లో నాణ్యత లోపం ప్రస్ఫుటంగా కనబడుతుందని, ప్రస్తుతం పనులను నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి పరాకాష్టగా మిగులుతుంది. వింజమూరు పరిధిలోని చెరువుకట్ట సమీపంలో వంతెన నిర్మించారు. రోడ్డుకి ఇరువైపులా రీవిట్ల నిర్మాణంలో నాణ్యత లోపించడంతో మట్టి కోతకు గురై సిమెంట్ పగళ్ళు కనిపించడం దారుణమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైవే పనులు పూర్తి కాకముందే ఇలాంటి నాణ్యత లోపం కనిపించడం సరైన పద్ధతికాదని, నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టాలని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉపాధిహామీ పనులు వద్ద కూలీలకు వసూలు కల్పించాలని ఎంపీడీవో అప్పాజీ ఏపీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పనుల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఫారంపండ్‌లను వేగవంతం చేయాలన్నారు.

## పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా ప్లాస్టిక్ నివారణతో కాలుష్యాన్ని నివారించవచ్చు తద్వారా ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపకుండా ఉంటుందని ఉద్దేశంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఒక ప్రత్యేకమైన ప్రణాళికను ప్రవేశపెట్టిందని బుధవారం కావలి జడ్పీ స్కూల్లో జరిగిన ప్లాస్టిక్ అవగాహన సదస్సులు మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్లాస్టిక్ వలన సమాజంలో పర్యావరణ ఏ విధంగా ప్రజల ఆరోగ్యం పై ప్రభావం చూపుతోందని అంశంపై ప్రతిభ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను కమిషనర్ శ్రవణ్ కుమార్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నేటి బాలలే రేపటి పౌరులు సమాజాన్ని అన్ని విధాల తీర్చగల తీర్చేదిద్దగల సమర్థవంతులు అయిన విద్యార్థి దశనుండే సమాజంలో చెడు ఎక్కడైతే ఉందో ఆ చెడుని తొలగించేందుకు ఒక ప్రత్యేక ప్రణాళిక ప్రకారం జీవించాలని ప్లాస్టిక్ పై తల్లిదండ్రులు కూడా అవగాహన కల్పించి ప్రజల ఆరోగ్యం పై వాటి ప్రభావితం ఎంతవరకు పనిచేస్తున్నాయని తెలపాల్సిందిగా విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో స్కూల్ పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు టీచర్స్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వేమిరెడ్డి సహకారంతో కంటి శస్త్ర చికిత్సలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గ పరిధిలోని కొడవలూరుకు చెందిన నలుగురికి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో నెల్లూరు నగరంలోని జయభారత్ హాస్పిటల్‌లో కళ్ళకు శస్త్ర చికిత్సలు నిర్వహించారు. పేదలకు వైద్య సహాయం అందివ్వడంలో చొరవ చూపించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఔదార్యం పట్ల కళ్ళకు శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## టగ్ ఆఫ్ వార్‌లో ఎమ్మెల్యే వేమిరెడ్డి టీమ్ విజయం

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎమ్మెల్యేల క్రీడా పోటీలు అలరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన ఎమ్మెల్యేల క్రీడా పోటీలలో టగ్ ఆఫ్ వార్ పోటీలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జట్టు ఘన విజయం సాధించింది.



## యంబియులో రక్తదానం..



**చంద్రగిరి, మేజర్‌న్యూస్:** మోహన్‌బాబు జన్మదిన సందర్భంగా ఎంబీయూలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంబీయూ ఛాన్సలర్ మంచు విష్ణు సతీ మణి విరానికా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలోనర్సింగ్ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు 500 మంది రక్తదానం చేశారు. అలాగే 100 మందికి పైగా విద్యార్థులు అవయవ దానం చేస్తామని రిజిస్టర్ చేసుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతిలోని సిమ్స్, రుయా, మెటర్నిటీ, అమర, మారుతి, ఎన్ టిఆర్ ట్రస్ట్ హాస్పిటల్ వారి వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబి యు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, ప్రో.వోస్ట్ డా"నాగరాజ రామారావ్, వైస్ ఛాన్సలర్ ప్రొ. కరుణాకరన్, నర్సింగ్ ప్రిన్సిపాల్ అధ్యాపకులు పాల్గొన్నారు.

## డయాలసిస్ సేవ కేంద్రంలో పాలుపండ్లు పంపిణీ

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని రాంపల్లి వద్ద గల ఉచితడయాలసిస్ కేంద్రం నందు బుధవారం రెడ్డి ప్రసాద్ జన్మదిన సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ పుంగనూరు నోబుల్ వారిచే రోగులకు పాలు పండ్లు బిస్కెట్లు పంపిణీ చేశారుఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తి రెడ్డి కార్యదర్శి అమరావతి సురేష్ సభ్యులు రఘుపతి రెడ్డి బాలసుబ్రమణ్యం, అమరావతి, రామ్ కుమార్, ప్రకాష్, రాజేంద్ర, డయాలసిస్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## యానాదులకు దుస్తులు పంపిణీ

**చౌడేపల్లి రూరల్ మేజర్‌న్యూస్:** ప్రముఖ నటుడు విద్యాదాత మంచు మోహన్ బాబు జన్మ దిన వేడుకలు సందర్భంగా ఆయన వీరాభిమాని చింతపర్తి తాతయ్య యానాదులకు దుస్తులు పంపినీ చేశారు. బుధవారం గడ్డం వారి పల్లి మార్గంలోని యానాది కాలనీలో గల మహిళలకు చీరలు పిల్లలకు తిను బండారములు పంపిణీ చేశారు నిరుపేదల పాలిట విద్య ప్రదాతగా వెలుగొందుతున్న మంచు మోహన్ బాబు మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని తాతయ్య ఆకాంక్షించారు అనంతరం తిరుపతి సమీపంలోని విద్యానికేతన్‌కు వెళ్లి మోహన్ బాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోహన్ బాబు అభిమానులు పాల్గొన్నారు.



## లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

**పెద్దపంజాణి, మేజర్‌న్యూస్:** మండలంలోని పెనుగొ లకల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులుకు లోఓల్టేజి సమస్య రాకుం డా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు పుంగ నూరు డివిజన్ విద్యుత్ ఈఈ శ్రీనివాసమూర్తి తెలి పారు. పెనుగొలకల సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పా టు చేసిన కెపాసిటర్ బుధవారం ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో విద్యుత్ వినియోగదారులకు లో వోల్టేజ్ సమస్య తలెత్తకుండా మోటార్లు,ట్రాన్స్ఫార్మర్లు మరమ్మతులకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో లోవోల్టేజ్ సమస్య నివారణకు "అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈఈ శ్రీనివాసులు, ఏఈఈ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.



## దొరస్వామి రాజుకి మాజీ డిప్యూటీ సీఎం నివాళులు

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలం ఆర్ కే వి బి పేట, గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న రాజుల కండ్రిగ గ్రామంలో ఇటీవల దొరస్వామి రాజు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుం బాన్ని. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి విదేశాలలో ఉండడంతో వైయస్ఆర్సీపీ సీనియర్ నాయకుడు దొరస్వామి రాజు దహన క్రియలకు హాజరు కాలేక పోయారు. విదేశీ యాత్రలు ముగించుకొని వచ్చిన మాజీ డిప్యూటీ సీఎం రా జుల కండ్రిగ గ్రామానికి వెళ్లి కీర్తిశేషులు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు దొరస్వామి రాజు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకు లు శేఖర్ రాజు, చందు రాజు, పురుషోత్తమ రాజు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## అనారోగ్యంతో నేనేరమ్మ పూజారి మృతి

**కార్వేటినగరం మేజర్‌న్యూస్:** మండలంలోని డిఎం పురం పంచాయతీ పాత దేరాకండిగా గ్రామం నేనేరమ్మ గుంట నేనేరమ్మ ఆలయ పూజారి అనారోగ్యంతో బుధవారం తెల్లవారుజామున 12:30నిమిషాలకు గారైన కీర్తి శేషులు శ్రీ బుర్రా కృష్ణమండడి (నైనేరమ్మ పూజారి)గారు స్వర్గస్తులైనారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ శోక తప్త హృదయాలతో వారి కుమారులు సుబ్రమణ్యం, గోపాల్, అనంద్, భారీ కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల గ్రామ స్తులు మృతదేహానికి పూలు మానేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ నేనే రమ్మ ఆలయ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని దీంతోపాటు పూజారిగా ఇతని సేవలో కొనియాడారు, ఇతని మృతి పట్ల గ్రామానికి తీరంలోట అన్నారు.



## 21, 22 తేదీల్లో కుప్పం నియోజక వర్గంలో మెగా సదరం క్యాంప్

### కడ పిడి వికాస్ మర్మత్



**శాంతిపురం, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే దివ్యాంగులకు మరియు వయోవృద్ధులకు ధృవీకరణ పత్రాలు జారీ చేయుటకు ఈ నెల 21 మరియు 22 తేదిలలో మెగా క్యాంపు కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలో కుప్పం నియోజక వర్గం మండలాలకు నిర్వహించబ డునని కడ పిడి వికాస్ మర్మత్ బుధవారం ఒక ప్రకట నలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తూరు జిల్లా లోని కుప్పం నియోజక వర్గంలోని దివ్యాంగులకు, వయోవృద్ధులకు ధృవీ కరణ పత్రాల కొరకు సదరం క్యాంపులు ప్రభుత్వ ఆసుపత్రి కుప్పం నందు నిర్వహించుటకు జిల్లా కలెక్టరు వారి ఆమోదముతో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వారు ఈ క్రింది తేదిలలో సంబంధిత మండలాలకు అంగ వైకల్య ధృవీకరణ నిర్ధారించడానికి క్యాంపులు నిర్వహించబ డును. గురువారం 1. గుడుపల్లి 2.శాంతిపురం 3. రామకుప్పం హాజరు కావలసిన ప్రదేశం ప్రభుత్వ ఆసుపత్రి, కుప్పం బుధవారం 1. కుప్పం రూరల్ 2. కుప్పం మునిసిపాలిటి హాజరు కావలసిన ప్రదేశం: ప్రభుత్వ ఆసుపత్రి, కుప్పం ధృవీకరణ పొందడానికి అర్హులు: దారిద్ర్యరేఖకు దిగువనున్న వారు, తెల్ల రేషన్ కార్డు మరియు కుప్పం నియోజక వర్గానికి సంబందించిన ఆధార్ కార్డు కలిగి యున్న వారికి మాత్రమే.అంగ వైకల్య ధృవీకరణ క్యాంపునకు తీసుకోని రావలసిన పత్రములు1. ఆధార్ కార్డ 2. తెల్ల రేషను కార్డ 3. పాసుపోర్టు సైజు ఫోటోలు 4. ఇది వరకే ఏదైనా డాక్టరు దగ్గర చికిత్స పొందిన రిపోర్టు తీసుకోని రావలెను.పై కనబరచిన అన్ని కాపీలు 2 సెట్లు జిరాక్సు తీసుకోని రావలెను.ముఖ్య గమనిక ఈ యొక్క క్యాంపు వివరములు ఏదైనా అవసరమైనయెడల సంబంధిత గ్రామ సచివాలయ సిబ్బందిని వారిని వెంటనే సంప్రదించ వలసినదిగా కోరడమైనది.

## పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేసిన సిఐ

కార్వేటినగరం, మేజర్‌న్యూస్: మండలంలోని కత్తిర పల్లి పంచాయితీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జరుగుతున్న పదో తరగతి పరీక్షల కేంద్రాన్ని సిఐ హనుమంతప్ప బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసిన ట్లు ఆయన తెలిపారు.

## 23న ఆత్మగౌర పరిరక్షణ కై మాలల సింహ గర్జన

**– రాయలసీమ మాలల జేఏసీ నేతల పిలుపు**



**తిరుపతిరెవెన్యూ, మేజర్‌న్యూస్:** అనగారిన బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడే రిజర్వేషన్లను పూర్తిస్థాయిలో రద్దు చేయాలని కుట్రతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ తెరపైకి తెచ్చి మాలలను దగా చేసేందుకు ప్రయత్నిస్తోందని రాయలసీమ మాలల జేఏసీ నేతలు ధ్వజమెత్తారు. బుధవారం బాలాజీ కాలనీలోని అంబేద్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాయలసీమ మాలల జేఏసీ గౌరవ అధ్యక్షుడు అశోకరత్న మాట్లాడారు. 2011 జనాభాను ప్రాతిపదికగా తీసుకొని మాలలను తక్కువగా చూపిస్తూ మాదిగలకు ఉపకరించేలా వర్గీకరణను ఆమోదానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. రాయలసీమ మాలల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 23వ తారీఖున భారీ స్థాయిలో తిరుగుతూనే నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్లో 23వ తేదీ సాయంత్రం మూడు గంటలకు మాలల సింహగర్జన సభను చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సింహగర్జన సభకు రాయలసీమలోని యావత్ మాల జాతితో పాటు దళిత మేధావులు ఉద్యోగులు, పెద్ద ఎత్తున తరలివచ్చి మాలల ఐక్యతతో తమ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాయలసీమ మాలల జేఏసీ ప్రతినిధులు మల్లారపు మధు. సుదర్శనం. ఏ ఆర్ అజయ్ కుమార్. ధన శేఖర్. కే మురళి. అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## వేసవికాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**గుడిపాల, మేజర్‌న్యూస్:** ఎండలు తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ రశ్మిత బుధవారం బొమ్మసముద్రం ప్రాథమిక వైద్య కేంద్రంలో మీడియా సమావేశంలో తెలిపారు ఈ డాక్టర్ రశ్మిత మాట్లాడు తూ ఎండాకాలం సంభవించడంతో ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువగా తాగాలని సూచించారు. బయటకు వెళ్లి పని చేసేవాళ్లు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని ఆమె తెలిపారు. పలుచటి నూలు దుస్తులను ధరించడం వల్ల ఉక్కు పోతనుండి మన శరీరాన్ని కాపాడుకోవచ్చు. మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల మన శరీరానికి వడదెబ్బ నుండి కాపాడుకోవచ్చు. ప్రతి ఒక్కరూ వేసవికాలంలో పండించే పుచ్చకాయ, కడప మల్లీ,దోసకాయ చల్లటి మజ్జిగను సేవించవచ్చని డాక్టర్ తెలిపారు. ఆరుబయట తిరిగివచ్చిన వెంటనే స్నానాలు చేసి సేద తీరితే కొంత ఉపశమనం కలుగుతుందని డాక్టర్ రశ్మిత సూచించారు. వయోవృద్ధులు ఎక్కువసేపు మంచానక పరిమితం కాకుండా చెట్ల కింద సేద తీరితే ఎండ తీవ్రతను తగ్గించి కొంత ఉపశమనం కలుగుతుందని డాక్టర్ తెలిపారు. ఎండలో తిరిగి వచ్చిన వాళ్లకు తల తిరుగుతుంటే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా చికిత్స చేయించుకోవాలని తద్వారా బీపీ, షుగర్, ఉన్నట్లయితే తగిన మందులు ఇవ్వడం ఓరాసిస్ ఇవ్వడం జరుగుతుందని డాక్టర్ రష్మిత తెలిపారు. ప్రతి ఒక్కరు ఎండలో దృష్టిలో ఉంచుకొని బయట అనవసరంగా ఆరుబయట తిరగకూడదని, అలా తిరిగితే వడదెబ్బ తగులుతుందని జాగ్రత్త వహించి ఎండలో ఎక్కువగా తిరగకుండా తమ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని డాక్టర్ రష్మిత తెలిపారు.

## దాతల సహాయంతో భక్తులకు రక్షిత మంచినీరు

**– చైర్మన్ పుదూరు లక్ష్మణ్ రెడ్డి**



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని పానగల్‌లో వెలసిన శ్రీశ్రీశ్రీ పొన్నాలమ్మ తల్లి దేవస్థానంకు వచ్చే భక్తులకు రక్షిత మంచినీరు అందించాలని దాతలను సహాయం కోరినట్లు శ్రీకాళహస్తి పట్టణం పొన్నాలమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షులు పుదూరు లక్ష్మణ్ రెడ్డి తెలిపారు. దాతలు మురళి కృష్ణారెడ్డి సంగీత దంప తులు, గోపీనాథ్ రెడ్డి వాణి దంపతులు, తిరుక్కాల వెంకట ముని బాబు, బసీవిరెడ్డి సుబ్బరామిరెడ్డి, పోలి ముని రామయ్య కుటుంబ సభ్యులు, సువర్ణం రవి వారి వారి వంతు సహాయం చేశారు. దీంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం దాతలు చేతులు మీదుగా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వక సభ్యులు, ఆలయ అర్చకుడు జగదీష్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం బాడీబిల్డర్లను ప్రోత్సహించాలి




**కుప్పం, మేజర్‌న్యూస్** ఇటీవల జిల్లా లోని సూళూరుపేటలో జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ ఛాంపి యన్ షిప్ 75 కెజి విభా గంలో కుప్పం కు చెందిన మణి ఛాంపియన్ షిప్ సాధించాడు. దీనిని పురస్క రించుకొని లయన్స్ క్లబ్ అఫ్ కుప్పం వారియర్స్ తరపున ఘనం గా సత్కరించారు. ఈ సందర్బంగా లయన్స్‌క్లబ్ అడ్వైసర్ మహేష్ మాట్లా డుతూ ఎవరి ప్రొఫాషనల్ ట్రైనింగ్ లేకుండా స్వయంగా మూడు సంవత్సరాలు కష్టపడి ఈ ఘనత సాధించడం యువకులకు స్ఫూర్తి గా నిలవడం ఎంతో అభినందనీయం అని తెలిపారు.అదే విదంగా బాడీబిల్డర్ మణి మాట్లాడుతూ ప్రభుత్వం కూడ బాడీబిల్డింగ్‌ని ప్రోత్స హించాలని తెలిపారు.ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అడ్మినిస్ట్రేటర్ ప్రసాద్, డైరెక్టర్ సెల్వం, బాడీ బిల్డర్స్, యువకులు పాల్గొన్నారు.

## రూ.6.4 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ




**కుప్పం, మేజర్ న్యూస్:** తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో నిరుపేద చిరు వ్యాపారుల సంఘ సభ్యుడు వేలు కుటుంబ సభ్యులకు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పి.ఎస్. మునిరత్నం చేతులు మీదు గా సీఎం రిలీఫ్ ఫండ్ 6 లక్షల 40 రూపాయల చెక్కును బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పేదలకు అండగా ఉండాలనే ఉద్దేశ్యంతో వందలాది మంది పేదలకు వైద్య సేవల కోసం సీఎం సహాయనిధి ద్వారా చెక్కులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్ కుమార్, టిటిడి బోర్డు మెంబర్ వైద్యం శాంతారాం,జనసేన అధ్యక్షులు నరేష్, క్లస్టర్ ఇంచార్జ్ సత్యేంద్ర శేఖర్, చిరు వ్యాపారుల సంఘం అధ్యక్షులు ఎం మంజునాథ్, చిరు వ్యాపారుల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# ఎంఎస్ఎంఈ రుణాలతోనే ఆర్థిక పరిపుష్టి

## రుణాల మంజూరులో ప్రైవేటు బ్యాంకులు భాగస్వామ్యం కావాలి : జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్



**నెల్లూరు, కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఎంఎస్ఎంఈ రుణాలతో అన్ని రంగాల ఆర్థిక పరిపుష్టి సాధ్యమని, ఎంఎస్ఎంఈ రుణాల మంజూరులో ప్రైవేటు బ్యాంకర్లు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశం జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రైవేటు బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాల మంజూరులో బాగా వెనుకబడి వున్నారన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రైవేటు బ్యాంకర్లు కూడా ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు పూర్తి సహాయ సహకారాలు అందించి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముద్ర యోజన, పిఎంఈజిపి, ఎంఎస్ఎంఈ రుణాల మంజూరులో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎంఎస్ఎంఈ రుణాల మంజూరుతోనే ఆర్థిక స్వావలంబన, ఆర్థిక పరిపుష్టి సాధ్యమన్నారు. తద్వార అన్ని రంగాల్లో జిల్లా అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాఖ, మత్స్యశాఖ, పశుసంవర్ధకశాఖల ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలను ఆయా బ్యాంకులకు అధికారులు పంపి వున్నారని, ఈ రుణాల మంజూరులో అశ్రద్ధ తగదన్నారు. ఆయాశాఖలకు సంబంధించిన ఒక అధికారిని నోడల్ అధికారిగా నియమించి డిపార్టుమెంటు ద్వారా మంజూరయ్యే రుణాలకు సంబంధించి బ్యాంకులతో సమన్వయం చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్‌డిఎం, నోడల్ అధికారి సమన్వయంతో పనిచేసి బ్యాంకులతో సంప్రదించి లబ్ధిదారులకు రుణ మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామాల్లో లబ్ధిదారులతో నిర్వహించే అవగాహన సదస్సులకు ఆయా శాఖల బ్యాంకు అధికారులు కూడా పాల్గొనాలని కోరారు. జిల్లాలో ధాన్యం కొనుగోళు జరుగుతున్నందున రైసుమిల్లర్లకు బ్యాంకు గ్యారెంటీలు త్వరగా మంజూరు చేయాలని బ్యాంకర్లకు జేసీ సూచించారు. బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలన్నారు. బ్యాంకర్లందరూ సమష్టిగా పనిచేసి రుణాలను సామాన్యులకు చేరువ చేయాలని ఆయన కోరారు. లీడ్ డిస్ట్రిక్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్ మాట్లాడుతూ.. ఈ త్రైమాసికానికి సంబంధించి రుణాల మంజూరులో మంచి ఫలితాలు సాధించినట్లు చెప్పారు. 426413 మంది రైతులకు రూ.8558 కోట్ల పంట రుణాలు (96శాతం), 23513 మంది ఎంఎస్ఎంఈ లబ్ధిదారులకు 4095 కోట్లు (85శాతం), 646840 మంది రైతులకు మొత్తం వ్యవసాయ రుణాలు రూ.13988 కోట్లు (99శాతం), ప్రాధాన్యత రంగానికి సంబంధించి 701481మంది లబ్ధిదారులకు రూ.18569 కోట్లు (92శాతం) రుణాలు అందించినట్లు వివరించారు. ఈ సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ ప్రదీప్, నాబార్డు డీడీఎం బాబు, ఆర్‌బిఐ మేనేజర్ రాజేష్, పశు సంవర్ధక, మత్స్యశాఖ జెడిలు రమేష్‌నాయక్, నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, బీసీ కార్పొరేషన్ ఈడి నిర్మలాదేవి, మైనార్టీ కార్పొరేషన్ ఈడి హైపా ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకుకై కృషి చేయండి

## - కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** దేశవ్యాప్తంగా ఉన్నత మున్సిపాలిటీల ఎంపికలో భాగంగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఉత్తమ ర్యాంకు సాధించేందుకు సిబ్బంది అందరూ కృషి చేయాలని కమిషనర్ సూర్యతేజ పిలుపునిచ్చారు. నగర పాలక సంస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పారిశుధ్య విభాగం వారాంతపు సమీక్షలో భాగంగా శానిటేషన్ అధికారులు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షణ్ అభిప్రాయ సేకరణ కోసం నగరంలో ఓట్ ఫర్ వెబ్, ఓట్ ఫర్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను నగరవ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలోని ప్రజలంతా స్వచ్ఛ సర్వేక్షన్ సర్వేలో పాల్గొని, నిర్దేశించిన 10 ప్రశ్నలకు తమ అభిప్రాయాలను వెలిబుచ్చాలని కమిషనర్ కోరారు. డ్రైను కాలువలలో మురుగు నీరు సాఫీగా ప్రవహించేందుకు అవసరమైన చర్యలను సచివాలయాల వారీగా నివేదికలు అందించాలని సూచించారు. డివిజన్ల పరిధిలో డ్రైను కాలువల్లో మురుగు నిల్వ ఉండకుండా క్రమం తప్పకుండా పూడికతీత పనులను చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల ర్యాంపులు, కల్వర్ట్‌లు, సివిల్ పనులు, మెష్ ఏర్పాటు, లెవెలింగ్ పనులకు సంభందించిన యాక్షన్ ప్లాన్ చేపట్టి డ్రైను కాలువల మురుగు ప్రవాహానికి అంతరాయం లేకుండా పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. నిషేధిత సింగల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి దైనందిన జీవితంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధి వ్యాపారాలు, దుకాణాల నిర్వాహకులు, హోటళ్ళు, రెస్టారెంట్లలో ప్లాస్టిక్ నిషేదించినట్లు తెలియజేసి, వాడకాన్ని నిరోధించాలని తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో నార, గుడ్డ సంచుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించి, పర్యావరణ హితమైన ఉత్పత్తుల వినియోగంతో చెత్తను తగ్గించవచ్చని పౌరులలో చైతన్యం కల్పించాలని సూచించారు. వాటర్ పాకెట్లను తయారు చేస్తున్న కేంద్రాలను గుర్తించి వాటిని వెంటనే సీజ్ చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోని ఖాళీ స్థలాల యజమానులకు అవగాహన కల్పించి వారి స్థలాలను శుభ్రం చేయించే కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోందని సిబ్బందిని కమిషనర్ అభినందనలు తెలిపారు. ఇతర స్థలాల యజమానులు కూడా ఈ విధానాన్ని ఆచరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ డాక్టర్ మదన్మోహన్, అమృత్ పథకం పీడీ మాధురి, సూపెరెంటెండెంట్ సులోచన, శానిటరీ సూపర్వైజర్లు, ఇన్స్పెక్టర్లు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, మేస్త్రీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యం అస్తవ్యస్తం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కప్పరాళ్ళ తిప్ప గ్రామం వద్ద మురుగు నీరు రోడ్ల పై ప్రవహించడంతో ప్రయాణికులు వాహనదారులు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో రోడ్లపై ప్రయాణించే ప్రయాణికులు దుర్గంధం వెదజల్లడంతో ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితులు నెలకొంది. సంబంధిత అధికారులు మురుగునీరు రోడ్లపై చేరకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కాల్వలను తలపిస్తున్న సీసీ రోడ్డు

### ▸ ఇబ్బందులు పడుతున్న ప్రజలు



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో అధికారులు పర్యవేక్శణ లోపంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు ఇస్తున్న కోట్ల రూపాయల నిధులు అధికారుల పర్యవేక్షణ లోపంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు లేక అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రధానంగా వరికుంటపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని జంగంరెడ్డి పల్లి మెయిన్ సీసీ రోడ్డు రోజులు తరబడి డ్రైనేజీ నీరు రోడ్డుపై చేరి కంపు కొడుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోజులతరబడి నీరు నిలిచి ఉండడంతో దోమలకు ఆవాసంగా మారుతోంది. దీంతో ఏం రోగాలు వస్తాయోనని ప్రజలు వణుకుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో ప్రధాన రోడ్డుపై నిలిచిఉన్న మురుగు నీటిని తొలగించి డ్రైనేజీ కాలువను నిర్మించే శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## వీఎస్‌యూలో నాలుగవ సెమిస్టర్ పరీక్షలు

**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలలో డిగ్రీ పరీక్షలు మార్చి 5 నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం మధ్యాహ్నం జరిగిన నాలుగవ (సప్లిమెంటరీ) సెమిస్టర్ పరీక్షలో మొత్తం 101 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 95 మంది పరీక్షకు హాజరయ్యారు. 6 మంది గైహాజరయ్యారు. ఈ పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన పరీక్షల నిర్వాహణాధికారి డా. ఆర్.మధుమతి తెలిపారు.

# చెంచుగాని పాలెంలో పర్యటించిన పీడీ గంగాభవాని



**కావలి, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛఆంధ్ర స్వచ్ఛ గ్రామంలో భాగంగా వంద శాతం ఇంకుడు గుంతలు ఉన్న గ్రామంగా కావలి రూరల్ మండల పరిధిలోని చెంచుగాని పాలెం పంచాయితీని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మోడల్‌గా ఎంపిక చేసినట్లు డ్వామా పీడీ గంగ భవాని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె బుదవారం చెంచుగానిపాలెంలో ఇంకుడుగుంతలు నిర్మాణంను ఏపీడీ మృదుల, ఎంపీడీవో సీహెచ్ శ్రీదేవితో కలిసి పరిశీలించారు. ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఉండేలా చూడాలని, వారం రోజుల్లో నిర్మాణంలో ఉన్న అన్నీ ఇంకుడు గుంతలు పూర్తవ్వాలని ఎంపిడిఓ శ్రీదేవిని ఆదేశించారు. అనంతరం పీడీ గంగా భవాని మాట్లాడుతూ.. గ్రామాల్లో సరైన డ్రెయినేజీ కాలువలు లేక నీటి నిల్వలతో మురికి కూపంగా ఉంటున్నాయన్నారుదీంతో దోమలు ఉత్పత్తి కావడం, వ్యాధులు ప్రబ లుతున్నాయన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఉండాలని, దీని ప్రయోజనాలు పరిశీలించి, మిగిలిన గ్రామాల్లోనూ అమలు చేసేందుకు చెంచుగాని పాలెంను మోడల్‌గా తీసుకున్నట్లు చెప్పారు. ఈ గ్రామాల్లో 401 గృహాలు ఉండగా ఇప్పటికే 180 ఇళ్ళకు గతంలో ప్రభుత్వం ఇంకుడు గుంతలు నిర్మించిందని, 35 గృహాలు వారే స్వయంగా తవ్వుకునట్లు తెలిపారు. మిగిలిన 186 గృహాలకు ప్రభుత్వం నిర్మిస్తున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన నిధులు జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు జరుగుతుందని తెలిపారు. కాంట్రాక్టర్ల ద్వారా వీటిని నిర్మించడం వలన లబ్ధిదారులకు ఎటువంటి భారం కలగకుండా ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో మన మండలంలోని చించుగానిపాలెం గ్రామంను పైలెట్ ప్రాజెక్టుగా పరిగణలోకి తీసుకొని ఇక్కడ ప్రతి ఇంటికి ఇంకుడు గుంటలు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ జంపాని రాఘవులు, సచివాలయ కార్యదర్శి విజయ, సిబ్బంది పాల్గొన్నారు.